# పసుపు

పసుపు దుంపల్లోని పసుపు పచ్చదనం (కుర్కుమిన్) మరియు సుగంధ తైలం (2-6) వలన దీనిని ఆహార పదార్థాలకు రంగు, రుచి, సువాసనలు చేర్చుటకు, ఔషధాలలోను, చర్మసౌందర్యానికి వన్నెతెచ్చే పరిమళ ద్రవ్యాల తయారీలోను, రంగుల పరిశ్రమల్లోను ఉపయోగిస్తారు. అధిక కుర్కుమిన్ కల పసుపు రకాలకు మార్కెటు కలదు.

మన రాష్ట్రంలో 1,53,400 ఎకరాలలో సాగుచేయబడుతూ 4,17,810 టన్నుల దిగుబడినిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో పసుపు పండించే ముఖ్యమైన ప్రాంతాలు నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాదు, వరంగల్, కడప, కర్నూలు, గుంటూరు, కృష్ణా, విశాఖపట్టణం, కొంతవరకు ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి మరియు శ్రీకాకుళం జిల్లాలు.

చిన్న దేశాలయినటువంటి జమైకా, తైవాన్ నాణ్యమైన పసుపును మన కంటే తక్కువ ధరకు అమ్మడానికి అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడుతున్నాయి. కావున అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పసుపును పండించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అధిక కుర్కుమిన్ శాతం (5.5) కల అలెప్పి పసుపుకు మంచి వాణిజ్య మార్కెటు వుంది.

**వాతావరణం :** పసుపు దుంపజాతి ఉష్ణమండల పంట. తేమతో కూడిన వేడి వాతావరణం అనువైనది. వర్షపాతం 1200-1400 మి.మీ. వుండి నీటి వసతి యున్న ఏ ప్రాంతంలోనైనా పండించవచ్చు. మొలకెత్తేటపుడు $25-35^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. మెదక్, నిజామాబాదు జిల్లాలలో 600-700 మి. మీ. వర్షపాతం కల ప్రాంతాలలో కూడ అధికంగా సాగు చేస్తున్నారు.

**నేలలు :** బలమైన నేలలు పసుపు పండించడానికి శ్రేష్ఠమైనవి. గరప నేలలు మరియు మురుగు నీటి పారుదల సౌకర్యం గల ఇతర నేలలు అనుకూలం. నీరు నిలవ వుండే నేలలు, చౌడు మరియు క్షార భూములు పనికిరావు. ఉదజని సూచిక 5-7.5 మధ్య ఉండి సేంద్రీయకర్బనం ఎక్కువగా ఉన్న నేలల్లో బాగా పండుతుంది.

**రకాలు**

దుగ్గిరాల భారత దేశంలో 50 పసుపు రకాలు గుర్తించబడ్డాయి. అందులో ముఖ్యంగా అమలాపురు, ఆర్మూరు, దిండిగాం, ఇరోడ్, కోడూరు, ఒంటిమిత్ర, పి317, జిల్ ఫర్మ్-1, జిల్‌ఫర్మ్-2. కృష్ణ రకం అధిక పచ్చి పసుపు దిగుబడినిస్తుంది, కాని మన దేశంలో, రాష్ట్రంలో ఎండిన పసుపు కొమ్ములు మరియు పసుపు పొడికి ఎక్కువ ప్రాముఖ్యత, ప్రాధాన్యం వున్నాయి. కావున ఇరోడ్ రకం శ్రేష్టం.

ఈ మధ్యకాలంలో చేసిన పరిశోధనల వలన 16 అధిక దిగుబడినిచ్చే రకాలను గుర్తించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా కేరళలో రూపొందించిన ప్రభ, ప్రతిభ, అలెప్పి సుప్రీం, కృష్ణ, సుగుధం రకాలు ముఖ్యమైనవి. సోనాలి అనురకం 10 టన్నుల పచ్చికొమ్ములు/ఎకరాకు దిగుబడి నిస్తుందని పరిశోధనలో తేలింది.

**విత్తేసమయం :** స్వల్పకాలిక రకాలను మే చివరి వారంలో, మధ్యకాలిక రకాలను జూన్ మొదటి పక్షంలో, దీర్ఘకాలిక రకాలను జూన్ రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. జూలై రెండవ పక్షం తర్వాత నాటినట్లైతే దిగుబడి చాలా తగ్గుతుంది.

**ప్రవర్ధనం లేక వ్యాప్తి :** విత్తన కొమ్మును ఆరోగ్యవంతమైన బలమైన మొక్కల నుండి ఎంపిక చేసుకోవాలి. తల్లి కొమ్ములు, పిల్ల కొమ్ములు నాటటానికి వినియోగించుకొనవచ్చు. విత్తన కొమ్ముల బరువు 30-40 గ్రా॥ మరియు విత్తే లోతు 8 లేక 12 సెం.మీ. వున్న యెడల దృఢంగా మంచి ఎదుగుదల గల మొక్కలను పొందవచ్చు.

| రకం | లక్షణాలు | పంట కాలం (నెలల్లో) | పచ్చిపసుపు దిగుబడి (ట/ఎ) | ప్రత్యేక లక్షణాలు |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| **దీర్ఘకాలిక రకాలు** | | | | |
| మైదుకూరు | కొమ్ములు పొడవుగా, లావుగా వుండి, లేత పసుపు రంగును కల్గి ఉంటాయి. కడప జిల్లాలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. | 9 | 12-15 | మంచి నాణ్యత కల్గి ఉంటుంది. టేకూరి పేట కన్నా అధిక దిగుబడినిస్తుంది. 19 శాతం ఎండు పసుపు దిగుబడినిస్తుంది. |
| టేకూరిపేట | కొమ్ములు పొడవుగా, సన్నగా వుంటాయి. | 9 | 10-11.2 | కడప జిల్లాలోని సారవంతమైన ఎర్రనేలల్లో సాగుచేసే ఈ రకం దుంపలు మంచి రంగు కలిగి, ఎక్కువ క్యూరింగ్ శాతాన్ని కలిగి ఉంటాయి. |
| సి.యల్.యల్.-326 | కొమ్ములు పొడవుగా, గట్టిగా వుంటాయి. | 9 | 10-15 | నిగారింపుతో లేత పసుపు రంగు కలిగి, 20 శాతం ఎండు పసుపు దిగుబడి నిస్తుంది. |
| ఆర్మూర్ | కణుపులు దగ్గర, దగ్గరగా ఉండి, దుంపలు గట్టిగా నిండు పసుపు రంగు కలిగి వుంటాయి. నిజామాబాదు జిల్లాలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. | 9 | 10-12 | టాఫ్రైనా ఆకుమచ్చ తెగులు రాదు. |
| దుగ్గిరాల ఎరుపు (గుంటూరు ఎరుపు) | కణుపులు దూరంగా ఉండి, దుంపలు పెద్దవిగా గట్టిగా నిండు ఎరుపు రంగును కల్గి ఉంటాయి. క్రిష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా సాగు చేయ బడుతుంది. | 9 | 12 | టాఫ్రైనా ఆకుమచ్చ తెగులు రాదు. |
| కె.టి.యస్. - 3 (సివి-21ఎ) దుగ్గిరాల తెలుపు / గుంటూరు తెలుపు | దుంపలు పెద్దవిగా, పొడవుగా, లావుగా నిగారింపుతో, లేత పసుపు రంగును కలిగి వుంటాయి. | 9 | 10-12 | టాఫ్రినా ఆకుమచ్చ రాదు. దుంప కుళ్ళు తెగులును తట్టు కొంటుంది. 20% ఎండు పసుపు దిగుబడి నిస్తుంది. |

| (1) | (2) | (3) | (4) | (5) |
|---|---|---|---|---|
| కె.టి.యస్ - 8 | దుంపలు పొడవుగా, బలిష్టంగా, నిగారింపు కలిగి లేత పసుపు రంగును కలిగి వుంటాయి. | 9 | 12-14 | టాఫ్రినా ఆకుమచ్చ రాదు. దుంపకుళ్ళు తెగులును తట్టుకొంటుంది. 20% ఎండు పసుపు దిగుబడినిస్తుంది. |
| **మధ్యకాలిక రకాలు** | | | | |
| సి.యల్.ఐ-317 | కొమ్ములు లావుగా, గతుకులతో వుంటాయి. | 8 | 8-14 | 19.6 శాతం ఎండు పసుపు దిగుబడినిస్తుంది. తాటాకు తెగులును తట్టుకుంటుంది. ఆకుపచ్చ తెగులుకు గురవుతుంది. |
| అమృతపాణి కొత్తపేట | కొమ్ము మందంగా ఉంటుంది. | 8 | 9-10 | కాంతివంతమైన పసుపు రంగును కల్గి ఉంటుంది. |
| **స్వల్పకాలిక రకాలు** | | | | |
| కస్తూరి | కొమ్ములు సన్నగా పొడవుగా వుంటాయి. | 7 | 6-8 | గోదావరి జిల్లాల్లో, ఏజన్సీ ప్రాంతాల్లో సాగుచేయబడుతుంది. సువాసన కల్గి పసుపు శాతం ఎక్కువగా ఉంటుంది. |
| సుగుణ (పి.సి.టి-13) | దుంప మధ్యస్థంగా ఉండి కాంతివంతమైన పసుపు నిస్తుంది. | 6 | 8 | సేంద్రీయ ఎరువుతో పండిస్తే వండిన తర్వాత దుంపపై ముడత రాదు. దుంప కుళ్ళును తట్టుకొనే రకం. |
| సుదర్శన (పి.సి.టి-14) | దుంప మధ్యస్థంగా ఉండి కాంతివంతమైన పసుపు నిస్తుంది. | 6 | 8 | పసుపుపచ్చ దనం (కుర్కుమిన్) ఎక్కువగా వుండి, దుంపకుళ్ళు ను తట్టుకొనే రకం. సేంద్రీయ ఎరువుతో పండిస్తే దుంపపై వండిన తర్వాత ముడతరాదు. |

6-8 సెం.మీ. పొడవుతో దృఢంగా వుండే మొలకెత్తు మొగ్గలున్న పిల్ల కొమ్ములు అనువుగా వుంటాయి. విత్తనపు దుంపలుగా తల్లి కొమ్ములు వాడినపుడు దిగుబడులు ఎక్కువగా వుంటాయి. ఎకరాకు 1000 కిలోల విత్తనం కావాలి.

**నేల తయారి :** వేసవిలో భూమిని లోతుగా గుల్లగా దున్నాలి. దుక్కి బాగా మెత్తగా వుండాలి. 6-8 సార్లు దున్ని ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు అంతే మోతాదులో చెఱువు మట్టికూడా వేసి కలియదున్నాలి.

**విత్తన శుద్ధి :** విత్తన శుద్ధిని రెండుసార్లు చేసుకోవచ్చు. మొదటిసారి విత్తన శుద్ధి చేసుకొని ఆరబెట్టిన తరువాత నీడ ప్రదేశంలో కుప్పలాగా పోసి నిలువ వుంచుకోవాలి. రెండవసారి విత్తనశుద్ధి నాటేటపుడు చేసుకోవాలి. విత్తనశుద్ధి చేసేటపుడు మొలక విరగకుండా జాగ్రత్త వహించాలి. ఒకేసారి చేయాలనుకుంటే విత్తనం ఎంపిక చేసుకొని శుద్ధి చేసి నిలువ వుంచుకోవడమే మంచిది. దీని కొరకు బలమైన, మొలకెత్తిన మొగ్గలు గల పిల్ల కొమ్ములను ఎంచుకోవాలి. విత్తన శుద్ధి చేయటం వలన విత్తనం ద్వారా సంక్రమించే దుంప, వేరుకుళ్ళు తాటాకు తెగులు, ఆకుమచ్చ తెగుళ్ళకు

కారణమైన శిలీంధ్రాలు నాశనమవుతాయి. భూమిలోని హానికర శిలీంధ్రాలు కొంతకాలం వరకు విత్తనాన్ని ఆశించవు. ఇందుకని లీటరు నీటికి 3 గ్రాముల రిడోమిల్ యం.జెడ్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాలసేపు వుంచి, బయటకు తీసి, నీడలో ఆరబెట్టి తరువాత నాటుకోవాలి. విత్తన పసుపుకు పొలుసుపురుగులు ఆశించి వుంటే శిలీంద్రనాశినితోపాటు లీటరు నీటికి 3-5 మి.లీ. మలాథియాన్ లేదా 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ మందు కలిపితే మంచిది. తరువాత నీటిని ఆరబెట్టి నీరు మార్చి లీటరు నీటికి 5 గ్రా.ల ట్రైకోడెర్మా విరిడి చొప్పున కలిపి ఆ ద్రావణంలో దుంపలను ముంచి ఆరబెట్టాలి.

**నాటే పద్ధతులు**

మన రాష్ట్రంలో పసుపును 3 పద్ధతుల్లో నాటవచ్చు. 1) ఎత్తుమడుల పద్ధతి, 2) సమతల మడుల పద్ధతి, 3) బోదె సాళ్ళ పద్ధతి

**ఎత్తుమడుల పద్ధతి :** ఈ పద్ధతిలో మీటరు వెడల్పు, మడికి మడికి మధ్య 30 సెం.మీ. వెడల్పుకాలువ ఉండేటట్లు ఎత్తుమడులు తయారు చేసుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ., దుంపల మధ్య 15 సెం.మీ. ఎడం ఉండేలా నాటుకోవాలి.

**సమతల మడుల పద్ధతి :** ఈ పద్ధతిలో 30 సెం.మీ. దూరంలో మడకసాలు చేసి అందులో 15 సెం.మీ. ఎడంలో విత్తనం వేసి సాళ్ళను చదును చేసి 3 మీ. పొడవు, 1.5-2 మీ. వెడల్పుగల కయ్యలు చేయవచ్చు. కయ్యల మధ్య నీటి కాలువ చేసి దాని గుండా నీటిని పారిస్తారు. ఈ పద్ధతివల్ల దుంపకుళ్ళు వచ్చే ఆస్కారం ఎక్కువ. అందువల్ల మురుగు నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి.

**బోదె సాళ్ళ పద్ధతి :** ఈ పద్ధతిలో 45-60 సెం.మీ. ఎడం వుండే విధంగా బోదెలు తయారు చేసుకొని ఆ బోదెల మీద 20 సెం.మీ. ఎడం వుంచి దుంపలు నాటుకోవాలి. రెండు వరుసల మధ్య ఉన్న సాలు ద్వారా నీరు అందించడం వలన బోదె నీటిని పీల్చుకొంటుంది. మొక్క వేర్లు, దుంప నీటిలో వుండవు కనుక దుంపకుళ్ళు ఆశించదు.

**అంతరపంటలు :** పసుపులో మొక్కజొన్న, ఆముదం సాగు లాభంగా వుంటుంది. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో రెండు వరుసల పసుపు, ఒక వరుస మొక్కజొన్న వేస్తారు. అదే విధంగా ఆముదంను అంతర పంటగా 10-12 పసుపు సాళ్ళకు ఒక వరుస చొప్పున నాటవచ్చు. మొక్కజొన్న (లేదా) ఆముదం పంటలను అంతర పంటలుగా వేసినపుడు రెండు పంటలకు సిఫారసు చేసిన ఎరువులు చేయాలి. పసుపును కొబ్బరి, మామిడిలో అంతర పంటగా సాగుచేయవచ్చు. పసుపును మామిడిలో అంతరపంటగా పెంచుటకు 60×20 సెం॥మీ॥ దూరంలో నాటిన యెడల అధిక దిగుబడులను పొందవచ్చు. పి.టి.యస్-43, సుగుణ, ఎ.సి.సి-360 అనురకాలు అంతర పంటలుగా అనుకూలమైనవి.

**అంతర కృషి :** దుంపలు నాటిన 40-45 రోజులకు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. నేల మరియు కలుపు ఉధృతి బట్టి పంట కాలంలో 3-4 సార్లు నాటిన 60, 90, 120 మరియు 150 రోజులకు పలు దఫాలుగా కలుపు తీయించాలి. ఎక్కువ విస్తీర్ణంలో పసుపుసాగు చేసినపుడు కూలీల ఖర్చు చాలా ఎక్కువ. కావున పొలం తయారీ దశలోనే గడ్డి, తుంగ ఎక్కువగా వున్న భూముల్లో వాటి నివారణకు గ్లైఫోసేట్ మందును లీటరు నీటికి 8 మి.లీ. కలిపి దానితోపాటు 20 గ్రా. అమ్మోనియం సల్ఫేట్ లేదా 10-15 గ్రా. యూరియా కలిపి పచ్చగాఉన్న కలుపుపై పిచికారి చేయాలి. దుంపలు నాటిన మరుసటిరోజే ఎకరాకు అట్రజిన్ అనే కలుపు మందును 500-800 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి తోటలో పదును ఉన్నపుడు సమానంగా పిచికారి చేయాలి.

**ఎరువులు :** సాధారణంగా పసుపు సాగులో రసాయనిక ఎరువుల వాడకం తక్కువ పసుపులో నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడులు సాధించాలంటే సమతుల సమగ్రమైన ఎరువులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పసుపు నాణ్యత పెంచాలంటే రసాయన ఎరువులతోపాటు సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడాలి. పసుపులో అధిక దిగుబడులు పొందుటకు 50 శాతం రసాయనిక ఎరువులతో పాటు 4 టన్నుల వర్మీకంపోస్టు, ఒక ఎకరాకు వేసిన యెడల నేల స్వభావాన్ని వృద్ధిచేసి, కార్బన్ శాతం పెంచటం వలన దుంప పెరుగుదల బాగుంటుంది. పసుపు పంటకు ఎక్కువ పోషకాలు అవసరం. ఒక ఎకరా పసుపు ఏకపంటకు, మొక్కజొన్న అంతరపంటగా వేసినప్పుడు ఏ ఏ ఎరువులు ఎప్పుడెప్పుడు ఎంతెంత మోతాదులో వేయాలో కింద ఇవ్వబడ్డాయి.

| వేయవలసిన సమయం | ఎరువులు | ఏకపంటగా | మొక్కజొన్న అంతరపంటగా |
|---|---|---|---|
| ఆఖరి దుక్కిలో | పశువుల ఎరువు | 10 టన్నులు | 10 టన్నులు |
| | ఆముదం/వేపపిండి | 200 కిలోలు | 250 కిలోలు |
| | సూపర్ ఫాస్ఫేట్ | 150 కిలోలు | 300 కిలోలు |
| | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 25 కిలోలు | 60 కిలోలు |
| నాటిన | వేప పిండి | 200 కిలోలు | 250 కిలోలు |
| 40 రోజులకు | యూరియా | 50 కిలోలు | 90 కిలోలు |
| 80 రోజులకు | యూరియా | 50 కిలోలు | 90 కిలోలు |
| | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 25 కిలోలు | 30 కిలోలు |
| 120 రోజులకు | యూరియా | 50 కిలోలు | 90 కిలోలు |
| | మ్యూరేట్ ఆఫ్ పొటాష్ | 25 కిలోలు | 30 కిలోలు |

పసుపుపంటకు పైపాటుగా వేసే యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఆకులపై వర్షపు నీటి బొట్లు, మంచు, తేమ లేనప్పుడు వేయాలి. లేకపోతే ఆకుల మీద పడ్డ రసాయనిక ఎరువులు ఈ నీటి బొట్ల మంచు బిందువుల్లో కరిగి గాఢత ఎక్కువై ఆకు మాడే ప్రమాదం ఉంది. అంతేగాక మొక్క లేత ఆకు కణజాలం దెబ్బతింటుంది. కాబట్టి రసాయనిక ఎరువులు చల్లేటప్పుడు సుడిలో పడకుండా మొక్కలకు 10-15 సెం.మీ. దూరంలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి నివ్వాలి.

**నీటి యాజమాన్యం :** తక్కువ వర్షపాత ప్రాంతాల్లో పసుపును నీటి వసతి క్రింద సాగుచేయాలి. పసుపు దుంపలు నాటిన వెంటనే ఒక నీటితడి తప్పనిసరిగా ఇవ్వాలి. తరువాత మొలకొచ్చి మొక్క భూమిమీద కనపడువరకు 4-6 రోజులకొకసారి నీరివ్వాలి. భూ భౌతిక, వాతావరణ పరిస్థితులను గమనించి బరువైన నేలల్లో సాధారణంగా 15-20 సార్లు, తేలికపాటి నేలల్లో 20-25 సార్లు నీరు పెట్టాలి. దుంపకుళ్ళు ఆశించినపుడు నీటి తడుల మధ్య వ్యవధి పెంచాలి. దుంపలు పక్వానికొచ్చే సమయంలో ఎక్కువ తడులు అవసరముంటుంది. పసుపులో బిందుసేద్యం ద్వారా ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. నీరు సక్రమంగా, నిలువకుండా ఉండేటట్లు ఇవ్వాలి.

**మల్చింగ్ :** కాలువల మధ్య భూమిని పచ్చిఆకులు లేదా ఎండుటాకులతో కప్పి ఉంచాలి. దీనివల్ల పసుపు బాగా మొలకెత్తడమే కాక కలుపు పెరగదు. నేలలో తేమ త్వరగా ఆరిపోదు. ఆకువల్ల సత్తువ, సేంద్రియ పదార్థం నేలకు అందుతుంది. అంతేకాకుండా ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు కూడా పైరుకు అందుతాయి. దీనివల్ల దిగుబడులు, నాణ్యత పెరుగుతాయి. మల్చింగ్ కొరకు జీలగ, జనుము, వేప, వెంపలి, సీమకానుగ, దిరసన, కానుగ, గ్లైరిసిడియా, లాంటి పచ్చి ఆకులను లేదా ఎండుటాకులను కప్పుతారు.

**పంటమార్పిడి :** ఒకసారి పసుపు వేసిన భూముల్లో 2 సం॥ వరకు పసుపు పంటను మరల వేయరాదు. వేసినచో దిగుబడులు తగ్గడమే కాకుండా చీడపీడల బెడద ఎక్కువై పంటకు హాని కలిగించే అవకాశం ఉంది. పసుపును వరి, చెఱకు, అరటి, తమలపాకు మరియు కూరగాయలు మొదలగు పంటలతో పంటమార్పిడి చేయాలి. ఈ పద్ధతిలో నీరు పుష్కలంగా ఉండాలి. పంటను బట్టి ఎరువుల యాజమాన్యం చేయాలి.

ఉత్తర తెలంగాణా మండలంలో ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్, జిల్లాల్లో పసుపు తర్వాత నువ్వు, ప్రొద్దుతిరుగుడు, సజ్జ మొదలగునవి సాగుచేయడం వాడుకలో ఉంది. ఈ పంటలు పసుపుకు వేసిన సేంద్రీయ, రసాయనిక మిగులు పోషక పదార్థాలనుపయోగించుకొని అధిక దిగుబడులనిస్తాయి. ఇట్టి అదనపు పంట ఉత్పత్తి పథకంలో సుగుణ (పి.సి.టి. 13), సుదర్శన (పి.సి.టి. 14) లాంటి స్వల్పకాలిక రకాలను వాడి అధిక దిగుబడులను పొందవచ్చు.

## సస్యరక్షణ

### పురుగులు

**ఎర్రనల్లి (పొగచూరు తెగులు) :** పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి ఆకులు పాలిపోయి ఎండిపోయేటట్లు చేస్తాయి. దీని నివారణకు నీటిలో కరిగే గంధకం 3గ్రా. లేక డైకోఫాల్ 5 మి.లీ. మరియు సాండోవిట్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం తడిచేటట్లు ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేయాలి.

**పొలుసు పురుగు (స్కేల్సు) :** విత్తనం నిలవ చేసేటప్పుడు కొమ్ముల్లో రసాన్ని పీల్చి వడలిపోయేటట్లు చేసి, నష్టాన్ని కలుగజేస్తుంది. ఇవి తెల్లని చుక్కలవలె దుంపల మీద కన్పిస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి మలాథియాన్ 5 మి.లీ.ల చొప్పున కలిపిన ద్రావణంలో విత్తనం కొరకు నిల్వచేసే పసుపు కొమ్ములను 30 నిమిషాలుంచి ఆరబెడితే పురుగు తాకిడి వుండదు.

**దుంపతొలుచు ఈగ (రైజోమ్ ఫ్లై) :** ఈ పురుగు పిల్ల పురుగులు తెల్లగా బియ్యం గింజల వలె వుండి భూమిలో వున్న దుంపలలోనికి చొచ్చుకొనిపోయి దుంపలోపలి పదార్థాన్ని తినేస్తాయి. అక్టోబరు నుండి పంట చివరి వరకు ఈ సమస్య వుంటుంది. దీని వలన సుడి ఆకు దాని దగ్గరలో ఉండే లేత ఆకులు వాడి గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. మువ్వ సుడిలాగా ఊడివస్తుంది. దుంపలో కణజాలం దెబ్బతింటుంది. పుచ్చు ఆశించిన దుంపలను వండితే తౌర్ర మాదిరిగా కనిపిస్తుంది. మొక్క ఎదుగుదల నిలిచిపోయి నాణ్యత, దిగుబడి చాలా తగ్గుతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపిన ద్రావణంలో దుంపలను నానబెట్టి విత్తనశుద్ధి చేసి నాటుకోవాలి. సమతుల ఎరువులను వాడాలి. దుంపపుచ్చు లక్షణాలు కనపడగానే ఎకరాకు 100 కిలోల వేపపిండిని మొక్కల మధ్య వేయాలి. వేపపిండి లేకపోతే ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 జి. గుళికలను అదే పరిమాణంగల ఇసుకతో కలిపి పొలమంతా సమంగా చల్లాలి. మురుగు నీరుపోయే సౌకర్యం కల్పించాలి. మొక్కల మధ్య నీరు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

### తెగుళ్ళు

**దుంప, వేరు కుళ్ళు తెగులు :** ఈ తెగులు సోకడానికి కారణాలు : విత్తనశుద్ధి చేయని కొమ్ములను నాటడం, మురుగునీటి పారుదల సరిగా లేకపోవడం, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించకపోవడం, ఎడతెరపి లేని వర్షాలు కురిసి మొక్కల చుట్టూ నీరు నిలబడి వుండడం, పొటాష్ మరియు వేపపిండి ఎరువులను సక్రమంగా వాడక పోవడం.

ఈ తెగులు సోకిన పొలం గమనించినపుడు ముదురు ఆకులు ముందుగా వాడిపోయి గోధుమ రంగుకు మారి చివరగా ఎండిపోతాయి. తరువాత మొక్కపై భాగాన వున్న లేత ఆకులకు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. తల్లి కొమ్ములు మరియు పిల్ల దుంపలు కుళ్ళి మెత్తబడి పోతాయి. దుంపలు కుళ్ళి చెడువాసన రావడమేకాకుండా నాణ్యత బాగా తగ్గుతుంది.

పై వ్యాధి సోకకుండా తెగులు సోకని విత్తనం వాడాలి. లీటరు నీటికి 3 గ్రా. రిడోమిల్ యం.జెడ్. (లేదా) మాంకోజెబ్, 2 మి.లీ మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణంలో కొమ్ములను 30-40 ని॥ నానబెట్టి తరువాత నీరు మార్చి లీటరు నీటికి 5గ్రాముల ట్రైకోడెర్మా విరిడి కలిపి, ఆ ద్రావణంలో 30 నిమిషములు వుంచి, నీడలో ఆరబెట్టి నాటుకోవాలి. ఒక కిలో ట్రైకోడెర్మాను 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండిలో కలిపి వారం రోజులపాటు అనువైన పరిస్థితిలో వృద్ధి చేసి ఆఖరి దుక్కిలో (లేదా) నెలరోజులకు మొదటి త్రవ్వకం చేశాక నీటి తడి యిచ్చిన వెంటనే చల్లాలి. వేసిన పొలంలోనే పసుపు వేయకుండా వరి, వేరుశెనగ, మొక్కజొన్న, జొన్న మొదలగు పంటలతో పంట మార్పిడి చేయాలి. దుంపలు విత్తిన తరువాత జీలుగ, జనుము, వెంపలి, వేప, కానుగ, మొదలైన పచ్చి ఆకులు లేదా ఎండు వరిగడ్డి, చెరకు ఆకులను పొలంపై దుంపలు మొలకలు వచ్చేంతవరకు కప్పడం వలన తెగులు ఉధృతిని కొంతవరకు తగ్గించవచ్చు. తెగులు తట్టుకొనే రకాలైన సుగుణ, సుదర్శనలను సాగు చేయవచ్చు.

**తాటాకు మచ్చ తెగులు :** ఈ తెగులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు, గాలిలో ఎక్కువ తేమ మరియు ఉష్ణోగ్రత తక్కువగా వుండడం వలన వ్యాపిస్తుంది. సెప్టెంబరు నుంచి యీ వ్యాధి కనపడుతుంది. అండాకారపు పెద్ద పెద్ద మచ్చలు ఆకులపై అక్కడక్కడా కనపడుతాయి. మచ్చలు ముదురు గోధుమ రంగులో వుండి మచ్చ చుట్టూ పసుపురంగు వలయం వుంటుంది. ఆకు కాడపై మచ్చలు ఏర్పడి క్రిందకు ఆకు వాలుతుంది.

నివారణ చర్యలుగా పైన సూచించిన విధంగా విత్తన శుద్ధి చేయాలి. దృఢమైన విత్తనాన్ని ఎన్నుకోవాలి. మచ్చలు వున్న, ఎండిన ఆకులను తొలగించి కాల్చివేయాలి. లీటరు నీటికి 1 గ్రా. కార్బండైజిమ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ అర మి.లీ. సబ్బు నీరు లేదా థయోఫానేట్ మిథైల్ 1 గ్రా. లేదా కార్బండైజిమ్ మరియు మాంకోజెబ్ కలిపి వున్న మందులను 15 రోజుల వ్యవధిలో సెప్టెంబరు నుండి 3-4 సార్లు పిచికారి చేయాలి.

**ఆకుమచ్చ తెగులు :** పై వ్యాధికి సూచించిన కారణాల వల్లే ఆకుమచ్చ రోగం వస్తుంది. దీని వలన మొదట ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడుతాయి. తరువాత చిన్నచిన్న గోధుమరంగు మచ్చలుగా మారతాయి. తెగులు ఎక్కువైతే ఆకు మాడిపోతుంది. నవంబరు, డిసెంబరు మాసాలలో ఈ తెగులు ఎక్కువగా కనపడుతుంది.

నివారణ చర్యలుగా వ్యాధి సోకిన ఆకులను కత్తిరించి నాశనం చేయాలి. తాటాకు మచ్చ తెగులుకు సూచించిన మందులతోపాటు 1 మి.లీ. ప్రోపికోనజోల్ లీటరు నీటికి కలిపి వాటిలో ఏదో ఒక మందును 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

## వేపపిండిని మరింత సమర్ధవంతంగా వినియోగించుకునే విధానం

పసుపును ఆశించే చీడ, పీడలలో దుంప పుచ్చు, దుంపకుళ్ళు అత్యంతప్రమాదకరమైనవి. ఇవి ఆశించిన తరువాత నివారించేకంటే రాకుండా నివారించడం మేలు. ఇలా నివారించేందుకు వేపపిండిని మరింత ప్రభావవంతంగా ఉపయోగించుకోవాలి.

సాధారణంగా రైతులు వేపపిండిని దుక్కిలోను, లేదా పైపాటుగా వేసి భూమిలో కలియదున్నుతారు. అలాకాక, దుంపపుచ్చుకు కారణమైన ఈగ మొదటిసారి కనిపించిన వెంటనే, వేపపిండిని ఎకరానికి 250-300

కిలోలు మొక్కల మొదళ్ళ చుట్టూ తడిగా ఉన్న నేలపై (నీటితడి ఇచ్చిన తరువాత) చల్లాలి. అలా చల్లిన వేపపిండి, మొక్కల మొదళ్ళ చుట్టూ తడిగా ఉన్ననేలపై అంటుకుని, తదుపరి ప్రతి తడిలోను, వేప ఊట మొదట చుట్టూ భూమిలోనికి దిగి పసుపు దుంపకుళ్ళు, దుంపపుచ్చును కలుగ జేసే క్రిమి కీటకాలను మొక్కల దరిచేరనీయక పైరును కాపాడుతుంది. పైరును ఎప్పటికప్పుడు గమనిస్తూ పైరుకాలంలో రెండు లేక మూడుసార్లు పైవిధంగా చేసి దుంపపుచ్చు, దుంపకుళ్ళు తెగుళ్ళ నుండి పసుపు పంటను కాపాడుకోవచ్చు.

**పోషకపదార్థాల లోపాలు**

**నత్రజని లోపం :** పొలంలో నీరు ఎక్కువ రోజులు ఉండడం, భూమిలో క్షార మరియు చవుడు గుణం కలిగి ఉండడం, సమతుల మరియు సమగ్ర ఎరువులు వాడకపోవడం అనేవి కారణాలు.

- దీనివల్ల ఆకులు పాలిపోయి లేత ఆకుపచ్చ లేదా పసుపుపచ్చగా మారతాయి. పైరు కురచగా అవ్వడం, ఆకులు కొన నుండి మధ్య వరకు మాడిపోవడం, కొమ్ములు సరిగా సాగకపోవడం, దిగుబడి తగ్గడం, కొమ్ముల్లో పచ్చదనం తగ్గడం, ముదురు ఆకులు త్వరగా ఎండిపోవడం జరుగుతుంది.
- లోప నివారణకు గాను మురుగు నీరు పోయే సౌకర్యం కల్పించాలి. సమతుల సమగ్ర ఎరువులు వాడాలి. లోపం గమనించగానే లీటరు నీటికి 20గ్రా. యూరియా, 1/2 మి.లీ. శాండోవిట్ లేదా టీపాల్ లాంటి సబ్బు నీరు కలిపిన 15 రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారి చెయ్యాలి. పసుపు విత్తిన వెంటనే మల్చింగ్ చెయ్యాలి.

**పొటాషియం :** పైరులో యీ లోపం రావడానికి చాలా కారణాలు వున్నప్పటికి ప్రధానంగా పైరులో నీరు ఎక్కువ కాలం నిలువ వుండడం ఒక కారణం. ఈ లోపంవల్ల ఆకుల అంచులు పాలిపోయి ఎండిపోతాయి. అంచులు పైకి లేదా క్రిందకు లేదా రెండు వైపులకు తిరిగి వుంటాయి. పిలకలు తక్కువగా వస్తాయి. వండిన కొమ్ముల్లో ఎండిన తరువాత ముడతలు ఏర్పడుతాయి. కొమ్ములలో కర్కుమిన్ పసుపు రంగు తగ్గుతుంది. మొక్కలు సులువుగా చీడపీడలకు గురవుతాయి.

లోపనివారణకుగాను, ముందుగానే లోపం గమనించినపుడు లీటరు నీటికి 10 గ్రా. మల్టి 'కె' లాంటి పోషకాలను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి లేదా సిఫార్సు చేసిన మేర పొటాష్ ఎరువులు వాడాలి.

**ఇనుపధాతు లోపం:** ఈ మధ్యకాలంలో ఈ లోపం ఎక్కువగా కనబడుతుంది. భూమిలో చౌడు, ఉష్ణ గుణాలు వుండి, సున్నం ఎక్కువగా వుండడం, నేలలో సేంద్రియ పదార్థం తక్కువగా వుండడం, భాస్వరం ఎక్కువగా వున్న ఆమ్ల భూముల్లో పంట సాగు చేయడంవల్ల యీ ధాతులోపం వస్తుంది. పొలంలో యీ లోపాన్ని చూసినపుడు లేత ఆకుల్లో ఈనెలు ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్యభాగం తెల్లగా మారుతుంది. ఒక్కొక్కసారి ఆకులంతా తెల్లగా మారుతుంది. ఆకు సైజు తగ్గి అంచుల కణజాలం దెబ్బతిని ఎండిపోతుంది. వండినపుడు దుంపలు, కొమ్ములు చిన్నవిగా తయారై నాణ్యత లోపిస్తుంది.

నివారణ చర్యలుగా ప్రధానంగా మురుగునీరు పోయే సౌకర్యం కల్పించాలి. లీటరు నీటికి 5 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ లేదా 10 గ్రా. అన్నభేది, ఒక గ్రా. నిమ్మ ఉప్పు కలిపి పైరుపై 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**జింక్ :** ముదురుటాకుల్లో లోపలక్షణాలు బాగా కనిపిస్తాయి. ఈనెల మధ్యభాగం లేత ఆకుపచ్చ రంగుకు మారుతుంది. ఆకులు దగ్గర దగ్గరగా కుచ్చులాగా వుంటాయి.

దుక్కిలోనే ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరులో లోప లక్షణాలు గమనించగానే లీటరు నీటికి 5 గ్రా. జింక్ సల్ఫేట్ అర మి.లీ. సబ్బునీరు వంతున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**పంటకోత, త్రవ్వటం :** పసుపు పంట విత్తిన షుమారు 210-270 రోజులకు త్రవ్వకానికి వస్తుంది. భూమిలో వున్నటువంటి పసుపు దుంపలు పక్వానికి చేరుతున్న కొలది మొక్కల ఆకులు పాలిపోయి ఎండటం ఆరంభమవుతుంది. మొక్కలు ఎండిపోయేవరకు పంట కోయరాదు. పసుపు బాగా పండినట్లు గుర్తు ఏమిటంటే మొక్కలు బాగా ఎండి నేలపై వాలిపోతాయి. పసుపును తవ్వే రెండు రోజుల ముందు మొక్క ఆకులు, కాండాలను భూమట్టానికి కోసివేయాలి. తర్వాత తేలికగా నీరుపెట్టి రెండు రోజుల తరువాత దుంపల త్రవ్వకం ప్రారంభించాలి. భూమిలో మిగిలిపోయిన దుంపలను నాగలితో దున్ని ఏరించాలి. తరువాత పసుపు దుంపలకు అంటివున్న మట్టిని తొలగించి శుభ్రపరచాలి. తవ్వి తీసిన 2-7 రోజుల లోపల ఉడక పెట్టిన యెడల పసుపు నాణ్యత చెడిపోకుండా వుంటుంది.

**పసుపు ఉడికించే సమయంలో జాగ్రత్తలు :** పొలంనుండి తీసిన కొమ్ములను త్వరగా ఉడికించి ఆరబెట్టాలి. ఆలస్యమైతే నాణ్యత తగ్గుతుంది. దుంపలను మరియు కొమ్ములను వేరువేరుగా ఉడక బెట్టాలి. పసుపు ఉడికించే బానెలలో దుంపలు, కొమ్ములు మునిగే వరకు నీరు పోసి సమంగా మంట పెట్టాలి. 45-60 నిమిషాలకు తెల్లటి నురుగు పొంగు దానితోపాటు పసుపుతో కూడిన మంచి వాసన పొగలు వస్తాయి. అప్పుడు పసుపును నొక్కితే మెత్తగా వుంటుంది. సన్న పొరక పుల్లనుగుచ్చితే లోనకు దిగబడుతుంది. ఆ దశలో పసుపును బయటకు తీయాలి. తక్కువ ఉడికితే ఎండిన తరువాత కొమ్ములోని గర్భంలో తొర్రలా ఏర్పడుతుంది. అప్పుడు సులువుగా విరుగుతుంది. ఎక్కువ ఉడికిస్తే ఆరిన తరువాత కొమ్మురంగు తగ్గి ఆకారం కోల్పోతుంది. పసుపును ఉడికించేందుకు వాడే నీరు శుభ్రంగా వుండాలి. బురద నీరు, ఉప్పునీరు వాడరాదు. పేడ కలుపరాదు.

**పసుపు ఆరబెట్టడం :** సమంగా ఉడికిన పసుపును చిన్న బానెల నుంచి తీసి బయట చదునైన, శుభ్రమైన నేల లేదా టర్పాలిన్ లేదా సిమెంట్ ప్లాట్ ఫారంపై కుప్పగా పోయాలి. 24 గంటల తరువాత రెండు, మూడు అంగుళాల మందముండేలా పరచాలి. పలుచగా పరిస్తే ఎండిన పసుపురంగు చెడిపోతుంది. 10-15 రోజులకు పసుపు తయారై కొమ్ములన్నీ ఒకే మాదిరిగా కనిపిస్తాయి. పసుపును అప్పుడప్పుడూ తిరగబెట్టాలి. మధ్యాహ్నం పూటతిరగ బెడితే సమంగా ఎండుతాయి. కొమ్ములు విరిస్తే కంచు శబ్దం వస్తే అది ఆరినట్లు. తేమ శాతం 8 ఉన్నట్లు లెక్క. ఎండిన పసుపు, పచ్చి పసుపులో షుమారు 20 శాతం తూగుతుంది. ఉడికిన పసుపు తడిస్తే పసుపు రంగు కోల్పోయి నారింజ రంగు వస్తుంది. కావున తడవకుండా పాలిథీన్ షీటు లేదా టార్పాలిన్ సిద్ధంగా ఉంచుకోవాలి.

**పసుపు ఆరేటప్పుడు ఆశించే బూజులు మరియు అఫ్లాటాక్సిన్ విష పదార్థాలు :** ఈ బూజులు ఆశించినపుడు కొమ్ములపై నల్లని, ఆకుపచ్చని మరియు తెల్లని ప్రాంతాలు ఏర్పడుతాయి. ఉడికిన పసుపు తొందరగా ఎండకపోవడం, పసుపులో అఫ్లాటాక్సిన్ వృద్ధి చెందడం జరుగుతుంది.

- దీని నివారణకు వండిన పసుపును ఆరబెట్టేటపుడు పైకి, కిందకు తిప్పుతుండాలి. ఉడికించేటపుడు తక్కువ, ఎక్కువ ఉడికించరాదు. ఎండ, గాలి తగిలే సమతులమైన, గట్టి కల్లంలో ఆరబెట్టాలి. ఉడికిన పసుపుకు దెబ్బతగలకుండా చూడాలి. పసుపును ఎండబెట్టేటపుడు వర్షంలోగాని, మంచులోగాని తడవకుండా కప్పివుంచాలి. తేమ శాతం 8 వచ్చే వరకు ఎండబెట్టాలి.

**పాలిషింగ్ :** ఎండిన పసుపు దుంపలు, కొమ్ములు గరుకుగా, పొలుసులు, చిన్నచిన్న వేర్లు కలిగి ఆకర్షణీయంగా వుండవు. కావున వాటిని మెరుగుపెడితే ఆకర్షణీయంగా తయారవుతాయి. మనుషులతో మెరుగు పెట్టేందుకు ఎండిన పసుపు దుంపలను, కొమ్ములను గట్టి ఉపరితలం మీద రుబ్బిగానీ లేదా గోనె సంచులలో చుట్టి కాళ్ళతో రుద్దటంకానీ చేయాలి. మరొక పద్ధతిలో ఒక డ్రమ్ముకు నడుమ ఇరుసుపెట్టి దాని పక్కల వ్యాకోచించే లోహంతో జల్లెడగా తయారుచేయించి, పసుపు దుంపలను, కొమ్ములను అందులోపోసి చేతితో ఇరుసును త్రిప్పితే డ్రమ్ము తిరుగుతుంది. డ్రమ్ము ప్రక్కభాగమందు ఇనుపమెష్ అమర్చి ఉండడం వలన ఒకదానికి ఒకటి రాసుకొని పసుపు మెరుగు పెట్టబడుతుంది. ఆఖరి దశలో మెరుగు పెట్టేటప్పుడు పసుపు పొడిని నీళ్ళలో కలిపి కొమ్ములపై చిలకరించితే

సరుకు ఆకర్షణీయంగా తయారవుతుంది. మెరుగు పెట్టేటపుడు దుంపలు, కొమ్ములు ఆకర్షణీయంగా ఉండేందుకు కృత్రిమ రంగులు వాడరాదు. వీటిని వాడడంవల్ల పసుపును దిగుమతి చేసుకొనే దేశాలు అభ్యంతరం తెలుపుతున్నాయి.

**గ్రేడింగ్ :** ఎండిన దుంపలను, కొమ్ములను సైజును బట్టి గ్రేడింగ్ చేయాలి. తరువాత మెరుగు పెట్టిన కొమ్ములను ప్యాకింగ్ చేసుకోవాలి.

**ప్యాకింగ్ :** దీనికోసం శుభ్రమైన క్రొత్త గోనె సంచులను వాడాలి. లోపలి భాగాన పూత వున్న గోనె సంచులను వాడడం మంచిది. తేమ తగలకుండా నిలువ చేసుకోవాలి. దీని కోసం నిల్వ చేసే సంచుల అడుగు భాగాన చాపలు వేసి వరిపొట్టు పరచాలి.

**పసుపు నిల్వ :** నీరు నిలవని, ఎత్తైన ప్రదేశాలను ఎన్నుకొని గుంటలు తయారుచేసి నిల్వ చేసుకోవాలి. 4×3×2 మీటర్ల గుంటలను తీసి 2-3 రోజులు బాగా ఎండబెట్టాలి. గుంత అడుగు భాగంలో రెండు అంగుళాల మందంతో వరిపొట్టు వేయాలి. గుంత అడుగు చుట్టూ పక్కగోడలను బోద లేదా వరిగడ్డితో 4 అంగుళాల మందంతో కప్పాలి. ఆ బోద లేదా వరిగడ్డి పొరను ఈత చాపలతో బాగా కప్పాలి. ఈత చాపలున్న గుంతలలో శుభ్రం చేసిన పసుపును పోయాలి. దుంపలను, కొమ్ములను వేరువేరుగా నిలువచేయాలి. ఒకవేళ ఒకే గుంతలో దుంపలను, కొమ్ములను నిలువచేయదలచుకొంటే తొలుత గుంత అడుగుభాగాన గుండ్రంగా వుండే దుంపలను వుంచి దానిపై ఈత చాపలు పూర్తిగా పరచి ఆపైన కొమ్ములు వేసి గుంతలు నింపాలి. గుంతలో పసుపును శంకు ఆకారంలో అంచులు పొర్లకుండా నింపాలి. శంకు ఆకారంలో ఉన్న పసుపు కుప్పను ఈత చాపలతో కొమ్ములు కనిపించకుండా పూర్తిగా కప్పాలి. ఈ విధంగా ఈత చాపలు పరచిన కుప్పపై బోద లేదా వరిగడ్డి కప్పి తరువాత మట్టితో కప్పాలి. ఈ విధంగా శంకాకారంలో కుప్ప చేసినందున వర్షపునీరు సులువుగా దొర్లిపోతుంది. చుట్టూ ప్రక్కగోడ ఎండిన తరువాత 2 శాతం లిండేన్ పొడిని గుంత అడుగున పలుచగా చల్లితే చెదలు పట్టవు. పసుపును గోనె సంచులలో ఉంచి కూడా పై విధంగా నిల్వచేయవచ్చు.

**గోదాముల్లో పసుపునిల్వ :** వండిన పసుపును గోనె సంచుల్లో నింపాలి. గోదాముల్లో నిల్వచేయాలి. లీటరు నీటికి 10 మి.లీ. మలాథియాన్ చొప్పున కలిపి గోనెసంచులపై పిచికారి చేయాలి. సంచులను ఎండలో ఆరబెట్టి, తరువాత పసుపును నిల్వ చేయాలి. నెలకు ఒకసారి మలాథియాన్ పిచికారి చేయాలి.

**విత్తన పసుపునిల్వ :** విత్తన పసుపును చెట్టు నీడన చల్లని ప్రదేశంలో నిల్వవుంచాలి. ఎటువంటి పరిస్థితులలోనూ ఆరుబయట ఎండతగిలేచోట విత్తనాన్ని నిల్వ చేయరాదు. చెట్టు నీడనగానీ, కొట్టాలు, పాకల్లో విత్తనాన్ని నిలువ చేయు ప్రదేశాన్ని సమతలంగా చేసి అర అడుగు మందంతో ఇసుక పరచాలి. తరువాత ఇసుకపై కొంచెం నీరు చిలకరించి విత్తన పసుపును శంకాకారంలో కుప్పగా పోయాలి. కుప్ప మీద వేపాకు, వరిగడ్డి లేదా మంచి పసుపు ఆకులను కప్పాలి. తరువాత ఎర్రమట్టి, పేడ కలిపిన లేపనం చేసి ఆకులపై అలకాలి. తొలకరి వర్షాలకు విత్తన దుంపలకు, కొమ్ములకు మోసులు వస్తాయి.

**నాణ్యత-ప్రపంచ వాణిజ్యం :** మనదేశం నుంచి అమెరికా, జర్మనీ, జపాన్, బ్రిటన్, ఇరాన్, నెదర్లాండ్స్, సౌది అరేబియా, ఆస్ట్రేలియా దేశాలకు పసుపు ఎగుమతి అవుతుంది. పసుపును దుంపలుగా, కొమ్ములుగా, పొడరుగా చేసి ఎగుమతి చేస్తారు. ఎగుమతి చేసే ముందు మనదేశ మార్కెటింగ్ సిబ్బంది సరుకును తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలకు లోటు లేని పక్షంలో అగ్‌మార్క్ లేబుల్ అంటిస్తారు. అగ్‌మార్క్ గ్రేడ్‌లుగా విభజిస్తారు. ఆ గ్రేడింగ్ దుంపల సైజు, రంగు, వాటిలోని చెత్త, మట్టి లాంటి పదార్థాలు, పగిలిన దుంపలు అదే విధంగా దానిలోని తేమ శాతం, మొదలైన వాటి ఆధారంగా గ్రేడింగ్ చేసి ఎగుమతి చేస్తారు.

పసుపు పంటసాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా : **"సైంటిస్ట్ (హార్టికల్చర్), పసుపు పరిశోధనా స్థానం, కమ్మరపల్లి-503308, నిజామాబాద్ జిల్లా"** ఫోన్ నెం. 08724-272343